విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దోమ, జనవరి 22: విద్యుత్ షాక్‌తో సోమవారం రైతు మృతి చెందాడు. దోమ మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన కుక్కల నర్సింహులు(58) తన పొలానికి నీరు పెట్టేందుకు బోరు దగ్గరికి వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు కోస్గి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దోమ పోలీసులు తెలిపారు.

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. వాడవాడలా భక్తిశ్రద్ధలతో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. ఎక్కడ.. ఎవరి నోట విన్నా జై శ్రీరాం నామమే వినిపించింది. కాషాయ జెండాలతో భారీ ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహించారు. శ్రీరామతత్వం ఉట్టి పడేలా ఇళ్ల ముందు ముగ్గులు వేసి శ్రీ బాల రాముడిని ఆహ్వానిస్తూ దీపాలు వెలిగించారు. సామూహికంగా నిర్వహించిన దీపోత్సవాలతో దేవాలయాలు దేదీప్యమానంగా కాంతులీనుతూ కనిపించాయి. ఈ అపురూప ఘట్టం గుర్తుండిపోయేలా రాత్రివేళల్లో బాణాసంచా, టపాసులు కాల్చి దీపావళిని గుర్తు చేసుకుంటూ వేడుక చేసుకున్నారు.



పరిగిలో శ్రీరాముడి శోభాయాత్ర

సర్వం.. రామనామం!

- భారీ స్క్రీన్ల ద్వారా వేడుకలను తిలకించిన భక్తులు
- ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలు, పారాయణాలు
- శోభాయాత్రలు.. అన్నదానం, ప్రసాద వితరణ
- రాత్రి వేళలో ఇళ్ల ముంగిట దీపాలు వెలిగించి స్వాగతం పలికిన మహిళలు
- దీపోత్సవాలతో కాంతులీనిన దేవాలయాలు
- ముచ్చింతల్‌లో వేడుకలకు హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్లు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేడుకలు



శ్రీరామందిరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఇంటింటా దీపోత్సవం

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సోమవారం సాయంత్రం మహిళలు తమ ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించారు. శ్రీరామతత్వం ఉట్టి పడేలా ఇళ్ల ముందు ముగ్గులు వేసి శ్రీ బాలరాముడిని ఆహ్వానిస్తూ రామజ్యోతులను వెలిగించారు. దేవాలయాల్లో సామూహికంగా నిర్వహించిన దీపోత్సవాలతో దేవాలయాలు కాంతులీనుతూ కనిపించాయి. ఈ అపురూప ఘట్టం గుర్తుండిపోయేలా రాత్రివేళలో బాణాసంచా, టపాసులు కాల్చారు.

వికారాబాద్/మేడ్చల్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామాలు, పట్టణాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శైవ, వైష్ణవాలయాలతో పాటు ఆంజనేయస్వామి తదితర దేవాలయాల్లో శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రపరిచిన శ్రీరాముడి అక్షింతలకు పూజలు చేసి భక్తులను ఆశీర్వదించారు. ఎవరు కలిసినా, ఎవరితో మాట్లాడినా జైశ్రీరాం అన్న మాటనే వినిపించింది. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. వికారాబాద్‌లో శ్రీరామ మందిరం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పైన అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మధ్యాహ్నం2 గంటల వరకు వీక్షించారు. శ్రీమల్లికార్జున భవన్‌లో డాక్టర్ ముద్ద దీప, భక్తవత్సలం దంపతులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణం నిర్వహించారు. దేవాలయంలో దీపోత్సవం నిర్వహించేంత వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగించారు. అలాగే తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లో వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

అలంరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పరిగిలో అభినయ డ్యాన్స్ అకాడమీ ఆధర్వంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డ్యాన్స్ మాస్టర్‌వండ్ల కవితను సన్మానించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి దంపతులు అభిషేకాలు, పూజలు చేశారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. గాంధీచౌక్‌లో కరసేవకులకు ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి బి.మారుతి కిరణ్ తదితరులు చేతుల మీదుగా సన్మానించారు. కాగా అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందూ విజయమని ప్రముఖ రచయిత,వక్త డాక్టర్ పి.భాస్కర యోగి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల స్వర్ణభారత్ ట్రస్టులో సోమవారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ మిజోరాం గవర్నర్ హరిబాబులు పాల్గొని పూజలు నిర్వహించారు. చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి చిలుకూరు గ్రామంలోని అంజనేయస్వామి దేవాలయం వరకు రంగరాజన్ పంతులు అధ్వర్యంలో ఊరేగింపు, ర్యాలీ చేపట్టారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్లలోని హనుమాన్ టెంపుల్, సీతారామ ఆలయంలో నిర్వహించినకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శ్రీ రామ... జయజయ రామ

మేడ్చల్ జిల్లా రామనామస్మరణతో మర్మోగింది. హిందూఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల వద్ద పూజలు చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. యువకులు జై శ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీలు నిర్వహించారు.శామీర్‌పేటలో శోభాయాత్ర, స్వామివారి కలాణ్యం నిర్వహించారు. అలాగే, ఘట్‌కేసర్, కీసర మండలా పరిధిలో వేడుకలను కనుల పండువగా జరుపుకున్నారు. తూంకుంటలోని విజ్ఞానభారతి పాఠశాల్లో శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

బాలరాముల జననం

బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రోజు పండంటి శిశువుల జననం



వికారాబాద్, మోమిన్‌పేటలో మగశిశువుల జననం

వికారాబాద్/మోమిన్‌పేట, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం దేశం మొత్తం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అయితే ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎత్‌బార్ పల్లి గ్రామానికి చెందిన విజయ్,సుప్రియ దంపతులు. వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సుప్రియ పండంటి మగ శిశువుకు జన్మనించింది.మా ఇంట బాలరాముడు జన్మించాడని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామచంద్రుడి పేరు వచ్చే విధంగా నామకరణం చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన జంగంశ్రావణి, ప్రవీణ్‌కుమార్ దంపతులకు పండంటి మగశిశువు జన్మినించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ మధురక్షణం ఎప్పటికీ మరచిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు.




మేడ్చల్‌లో శ్రీరాముడి ఊరేగింపు



తాండూరులో పూజలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌లో నైరాశ్యం!

- మల్లారెడ్డి తీరుతో అసంతృప్తిలో పార్టీ ప్రజాప్రతినిధులు
- పెరుగుతున్న అసమ్మతులు... అవిశ్వాసాలు..
- చాపకింద నీరులా కాంగ్రెస్ పావులు



మేడ్చల్ జనవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం గులాబీ గాలి వీచింది. జిల్లాలో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. మేడ్చల్ అసెంబ్లీ నుంచి కూడా మాజీ మంత్రి మల్లారెడ్డి మరోసారి పోటీ చేసి గెలుపొందారు. మల్లారెడ్డి గెలిచినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నేతలు కూడా డీలా పడిపోయారు. గెలిచిన ఉత్సాహం లేక స్తబ్దుగా ఉండిపోయారు. డీలా పడిపోయిన బీఆర్‌ఎస్ క్యాడర్‌ను తిరిగి ఉత్తేజపరచడంలో మల్లారెడ్డి పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తల్లో మనోధైర్యం నింపలేకపోయారని ఆ పార్టీ నేతలే బాహటంగా విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా మున్సిపాల్టీలు, మండలాలు, కార్పోరేషన్లు నెలకొన్న అసమ్మతిని చల్లార్చేందుకు మల్లారెడ్డి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో గెలుపొందిన తర్వాత నియోజకవర్గంలో ఒక్క చోట కూడా కనీసం కృతజ్ఞత సభకూడా నిర్వహించకపోవడంపై కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. గోవా, దుబాయ్ టూర్‌లలో విహరిస్తూ సొంత నియోజకవర్గ క్యాడర్‌ను గాలికి వదిలివేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వివాహేర యాత్రలపై విమర్శలు

ఇదే అదనుగా కాంగ్రెస్ పార్టీ చాప కింద నీరులా పావులు కదుపుతున్నది. నియోజకవర్గంలోని అన్ని పదవుల్లో దాదాపు బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే ఉన్నారు. ఆపార్టీలోని అసమ్మతి వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు దగ్గరకు తీస్తున్నారు. మల్లారెడ్డి కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో క్యాడర్ కూడా మెల్లమెల్లగా అసమ్మత్తులు.. అవిశ్వాసాల బాట పడుతున్నారు. తాజాగా జవహర్‌నగర్ కార్పోరేషన్‌లో మేయర్‌పై కార్పోరేటర్ అవిశ్వాసం పెట్టి టూర్‌కు వెళ్లిపోయారు. అదేబాటలో మరికొన్ని మున్సిపాల్టీల్లో కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారు. సొంతపార్టీకి చెందిన అసంతృప్త కౌన్సిలర్లను బుజ్జగించడంలో మల్లారెడ్డి పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. రెండు నెలలుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై దృష్టిపెట్టకుండా టూర్‌ల బాట పట్టడంపై సొంతపార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ఇప్పటికే పలు మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో చైర్మన్లపై అవిశ్వాస రాజకీయాలకు తెరలేపారు. ప్రస్తుతం వారు అధికారులను చాటుగా కలుస్తూ అవిశ్వాసాలపై తేదీలు ప్రకటించాలని కోరుతున్నారు. మరోవైపు మల్లారెడ్డి మాత్రం ఇవేమి పట్టించుకోకుండా టూర్ల బాట పట్టడంతో చైర్మన్‌లు, మేయర్‌లు ఆందోళన చెందుతున్నారు. త్వరలోనే నియోజకవర్గంలో పెద్దఎత్తున మున్సిపాల్టీల్లో అవిశ్వాసాలకు తెరలేవనున్నట్లు సమాచారం.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

వికారాబాద్ జనవరి 22 : కలెక్టరేట్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకర్షణీయమైన శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో 45 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటు, తగిన పరిష్కార చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. ఎన్నెపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ, సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా ఐదుగురు వయోవృద్ధులు, ఐదుగురు కొత్తగా ఓటర్ ఐడి పొందిన యువకులను సన్మానించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు యువత ముందుకు రావాలి

ఎయిర్ ఫోర్సులో అగ్నివీర్ చేరేందుకు జిల్లాలోని యువతి, యువకులు ముందుకు రావాలన్ని కలెక్టర్. నారాయణ రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌వింగ్ కమాండర్ గుర్‌ప్రీత్ ఆత్వాల్, సికింద్రాబాద్ విభాగంతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్మీడియట్ లేదా దానికి తత్సమాన విద్యార్హత గల విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 50శాతం మార్కులు గల అభ్యర్థులు లేదా తత్సమాన డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారు 2 జనవరి, 2004 నుంచి 2 జూలై, 2007 మధ్య జన్మించిన యువతి యువకులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చేనెల 6వ తేదీ వరకూ హెచ్‌టీటీపీః//ఏజీఎన్‌ఐపీఏటీహెచ్‌వీఏవైయూ.ఐఎన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష 17 మార్చి, 2024 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అగ్నివీర్‌వాయు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకు ముందు ఎయిర్ ఫోర్స్ కమాండర్ గుర్ ప్రీత్ అత్వాల్ స్థానిక ఎస్‌ఏపీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అగ్నివీర్ వాయుపై అవగాహన కల్పించారు.



ఎప్పుడిస్తారో!

నాలుగు నెలలుగా మోడల్ కళాశాలల హాస్టల్ సిబ్బందికి అందని జీతాలు

- ఆర్థిక ఇబ్బందుల్లో వార్డెన్లు, వంట నిర్వాహకులు, ఏఎన్ఎంలు
- సకాలంలో జీతాలు రాక ఉద్యోగం మానేసుకుంటున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 22 : నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది... అలాంటిది నెలల కొద్దీ రాకుంటే ఎలా అని మోడల్ కాలేజీల హాస్టల్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. జీతాలు సకాలంలో అందక కొందరు ఉద్యోగం మానేస్తున్నారు. త్వరగా జీతాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మోడల్ కాలేజీల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్‌స్కూల్ కళాశాల హాస్టల్‌లో వందమంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగ్లూరు, శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, యాచారం పరిధిలోని గున్‌గల్, మహేశ్వరం, మంచాల పరిధిలోని ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జినుగుర్తి, పరిగిలోని జార్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థినుల హాస్టల్‌లో కేర్‌టేకర్ ఉంటారు. వారికి నెలకు రూ. 12,500 చొప్పున నాలుగు నెలల వేతనం రావాల్సి ఉంది. అలాగే వాచ్‌మన్‌కు రూ.8,710, ఏఎన్ఎంకు రూ.7,800, హెడ్‌కుక్‌కు రూ.7,800, ఇద్దరు అసిస్టెంట్ కుక్కులు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున నాలుగు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మోడల్ స్కూల్ హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలను కేజీబీవీ ఎస్‌ఓలు చూస్తున్నారు. ఎస్‌ఓకు నెలకు రూ.2,500 చెల్లిస్తున్నారు. అయితే, సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇటీవలే షాబాద్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఏఎన్ఎం ఉద్యోగం మానేసినట్లు తెలిసింది.





ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

చాలీ చాలనివేతనాలు కూడా సకాలంలో రాక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరగా జీతాలు ఇవ్వాలని కోరుతూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషన్, జిల్లా విద్యాధికారికి విన్నవించాం. త్వరగా జీతాలు ఇవ్వాలి.

- శాంతి, వార్డెన్/కేర్‌టేకర్, పాల్మాకుల మోడల్ హాస్టల్, శంషాబాద్ మండలం



భారంగా కుటుంబ పోషణ

నాలుగు నెలల నుంచి జీతాలు లేవు. సంక్రాంతి పండగ కూడా చేసుకోలేము. జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నాము. వచ్చే చాలీ చాలని జీతంతో కుటుంబాన్ని పోషిస్తున్నాం. అవి కూడా సకాలంలో ఇవ్వడం లేదు.

- లావణ్య, వంట మనిషి, చేవెళ్ల మోడల్ స్కూల్ హాస్టల్

జీతాలు కోసం డీఈవోను కలుస్తాం

జీతాల కోసం డీఈవోను కలిసేందుకు సిద్ధమవుతున్నాం. సకాలంలో జీతాలు రాకపోవడంతో వర్కర్లు పని మానేస్తున్నారు. ఇప్పటికే మా హాస్టల్లో కుక్ మానేసింది. రోజువారి కూలీ ఇచ్చి వేరే వంటమనిషితో భోజనం వడ్డించి పిల్లలకు పెడుతున్నాం.

-నాగమణి, వార్డన్/కేర్‌టేకర్, నవాబుపేట మోడల్ స్కూల్ హాస్టల్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ గౌతమ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి వచ్చే అర్జీలను పరిష్కరించడానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కరమౌతాయని ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసాలకోర్చి వస్తుంటారని దీనిని దృష్టిలో పెట్టుకునిఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 77 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

83 మంది ఓటర్లకు తండ్రి ఒక్కరేనట !

- ఎంపీటీసీ ఫిర్యాదుతో విచారణ చేపట్టిన ఆర్డీవో



విచారణ చేస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

తాండూరు, జనవరి 22 : సాంకేతిక కారణాలతో జరిగిన తప్పిదం వల్ల 83 మంది ఓటర్లకు ఒకే వ్యక్తి పేరు తండ్రిగా నమోదైంది. ఈ సంఘటన, వికారాబాద్ జిల్లా ,తాండూరు మండలం కరణ్‌కోట్ గ్రామంలో చోటుచేసుకుంది. 8 పోలింగ్ కేంద్రాల్లో 83 మంది ఓటర్లకు తండ్రి పేరు సిర్రా హన్మంతుగా నమోదైంది. దీంతో ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఫిర్యాదుపై సోమవారం ఆర్డీవో శ్రీనివాస్‌రావు క్షేత్రస్థాయి విచారణ జరిపి, సాంకేతిక కారణాల వల్ల ఈ తప్పిదం జరిగిందని వివరించారు. ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి, అనర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ క్షేత్రస్థాయి విచారణలో తహసీల్దార్ తారాసింగ్, ఏవో మహేష్ గౌడ్, ఆర్ఐ రాజిరెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు


కులకచర్ల, జనవరి 22: అంగన్‌వాడీ కోడిగుడ్లను బహిరంగంగా మార్కెట్‌లో విక్రయించిన మండలంలోని మందిపాల్ గ్రామానికి చెందిన పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చౌడాపూర్‌లో ఆదివారం రూ.5కే అంగన్‌వాడీ కోడిగడ్లను మందిపాల్ వెంకటయ్య బహిరంగ మార్కెట్‌లో విక్రయించాడు. దీంతో అతన్ని గ్రామస్తులు పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అంజమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కోడిగుడ్లను స్వాధీనం చేసుకుని మందిపాల్ పెంటయ్యపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే పట్టుబడిన కోడిగుడ్లు వికారాబాద్‌కు సంబంధించినవి కావని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రేపు హార్టికల్చర్ యూనివర్సిటీ బృందం పర్యటన

వికారాబాద్, జనవరి 22: శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ నీరజ ప్రభాకర్, బృందం పూడూరులో బుధవారం(రేపు) పర్యటించనున్నట్లు ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి చక్రపాణి ఒక ప్రకటన తెలిపారు. స్థానిక ఆర్చిడ్ పాలిహౌస్‌ను, మామిడి తోట, వికారాబాద్ హార్టికల్చర్ ఫార్మ్‌ను క్షేత్రస్థాయిలో సందర్శిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో రైతులకు శిక్షణ ఉంటుందన్నారు.



















కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తా

● ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధి మల్లు రవి



మల్లు రవిని సన్మానిస్తున్న కేశవులు

ఆమనగల్లు , జనవరి 22: కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులను రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. పట్టణానికి చెందిన పలువురు నాయకులు సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో మల్లురవిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధిగా నియామకమైన సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఈ సందర్భంగా రవి వారికి సూచించారు. నాయకులు ఇమ్రాన్‌బాబా, ఫరీద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో ఆలయ భూములు స్వాధీనం



ఆలయ భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్, జనవరి 22 : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులోని శ్రీరంగనాయకస్వామి ఆలయానికి చెందిన భూములను కోర్టు ఉత్తర్వురుల మేరకు దేవాదాయ శాఖ అధికారులు సోమవారం స్వాదీనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ టి. శేఖర్ కథనం ప్రకారం రంగస్వామి ఆలయానికి షాబాద్ మండలం మన్‌మర్రి గ్రామ శివారులో సర్వేనెంబరు 280-1లో 4ఎకరాల 38 గుంటలు, 280-2లో 5 గుంటల భూమి ఉండగా దాన్ని పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూమి కోసం అధికారులు దేవాదాయశాఖ ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించారు. రెండు నెలల కింద దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో రైతులు హైకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో సదరు భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకుడు మధుబాబు, ఈఓలు శివకుమార్, ప్రవీణ్, గణేష్, చంద్రమోహన్, నరేందర్ తదితరులు ఉన్నారు.

బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంతోషకరం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

● స్వర్ణభారత్ ట్రస్టులో ఘనంగా రాములోరి కల్యాణోత్సవం

● పాల్గొన్న హర్యానా, మిజోరాం గవర్నర్లు



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు, హర్యానా, మిజోరాం గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కె.హరిబాబు

శంషాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సంతోషకరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో సోమవారం రాములోరి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకయ్యనాయుడుతో పాటు హర్యానా, మిజోరాం గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కె.హరిబాబులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠాపన చేయడానికి 500 సంవత్సరాలు వేచి చూశామని అన్నారు. ఆ కోరిక ఈరోజు నెరవేరిందని ఆయన తెలిపారు. విగ్రహం ప్రతిష్ఠించుకోవడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతీ ఊరు, ప్రతీ పల్లె శ్రీరామ నామ స్మరణతో మార్మోగిపోయిందన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించాలన్నది దేశంలోని హిందువుల చిరకాల కోరిక అని, అది నేడు నెరవేరడం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శ్రీరాముడి పేరును స్మరించుకుంటున్నారని అన్నారు. శ్రీరాముడు గతంలో సాగించిన పరిపాలనను గుర్తుచేసుకుంటూ మళ్లీ రామరాజ్యం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. అయోధ్యలోని రామమందిరంలో జరిగిన బాల రాముడి విగ్రహ ప్రాణపతిష్ఠ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరగడం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. సమాజంలో ప్రజలందరూ కలసిమెలసి ఉండి అవినీతి అనేది లేకుండా చేయాలని ఆయన ప్రజలను కోరారు.

ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో జిల్లా విద్యార్థులకు మెడల్స్

● అభినందించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 22 : జాతీయస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లా విద్యార్థులు మెడల్స్ సాధించారని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో వారికి మెడల్స్, సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ బొంరాస్‌పేట్‌కు చెందిన ఏ వైష్ణవి గోల్డ్ మెడల్, పీ.నందిని సిల్వర్ మెడల్, ఎస్. నవిత సిల్వర్ మెడల్, ఎన్ నందిని బ్రోన్జ్ మెడల్స్‌ను సాధించారని చెప్పారు. ఈనెల 20, 21 హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని కలెక్టర్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకదేవి అభినందించారు. కేజీబీవీ ఎస్వో రాధిక, కోచ్ సాయిలును అభినందించారు.

గ్యాస్ సరఫరాలో ఇబ్బంది కలగకుండా చూడాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



గోదాం వద్ద గ్యాస్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 22 : గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబికా ఏజెన్సీ కార్యాలయం, గోదాంను పరిశీలించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు అదనపుకలెక్టర్‌తో పాటు సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వెళ్లి పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీ వారి నిర్లక్ష్యం వల్లే గ్యాస్ కొరత ఏర్పడిందని కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లడం జరిగిందని సుధాకర్ రెడ్డి అన్నారు. కొందరు కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వానికి సంబంధం లేదని డీలర్ నిర్లక్ష్యం వల్లే సమస్య తలెత్తినట్లు చెప్పారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

● అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 22 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 19 వరకు పరీక్షలు జరుగబోతుండడంతో సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 65,965, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 65495 మంది పరీక్షలకు హాజరవుతారు. జిల్లా వ్యాప్తంగా 140 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, 4 ప్రభుత్వ, 136 ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ జూనియర్ కాలేజీలను పరీక్ష కేంద్రాల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, డీఈఓ విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పల్లెప్రగతితో సత్ఫలితాలు సాధించాం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



కందుకూరు: అన్నోజిగూడలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 22 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్లెప్రగతితో సత్ఫలితాలను సాధించామని, దానిలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రభుత్వఅధికారుల కృషి అభినందనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అన్నోజిగూడలో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ కాకి ఇందిరదశరథ, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించి, అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 20 గ్రామాలలో కొత్తగా గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించినట్లు, రూ.30లక్షల నిధులతో అన్నోజీగూడలో అన్ని అంగులతో పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. మారుమూల గ్రామాలను కూడా మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధును ప్రవేశపెట్టారన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లోకి వెంటనే పూర్తిస్థాయిలో జమచేయాలని కోరారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి వైఎస్ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు బి.నరేంగౌడ్, మంద సాయిలు, ఎంపీటీసీలు ఇందిరదేవేందర్, కాకి రాములు, నాయకులు కాకి దశరథ, మన్నె జయేందర్‌ముదిరాజ్, జి.లక్ష్మినర్సింహారెడ్డి, రఘురాంరాథోడ్, కృష్ణ పాల్గొన్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

● అనుమతి లేని వ్యాపారాలకు చెక్

● భూకబ్జాలపై విచారణ



తాండూరు హైదరాబాద్ రోడ్డులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

తాండూరు, జనవరి 22 : పదేళ్లుగా తాండూరులో జోరుగా సాగుతున్న అక్రమ వ్యాపారానికి స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చెక్ పెట్టించారు. కాగ్నా, కాక్రమేణి నదుల నుంచి సాగే అనుమతి లేని ఇసుక రవాణాను అరికట్టి రూ. 600లకే ట్రాక్టర్ ఇసుక లభించే విధంగా ఇసుక పాలసీని తీసుకువచ్చారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో డీడీ చెల్లించిన వారికే అనుమతులు ఇస్తున్నారు. మైనింగ్ అనుమతులు లేకుండా సుద్ద వ్యాపారం, నాపరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేయించారు. దాడులు నిర్వహించి చర్యలు తీసుకునేలా చేశారు. అధికారపార్టీ నేతలకు కూడా జరిమానాలు, నోటీసులు రావడంతో ఎమ్మెల్యే తీరుపై సొంతపార్టీ వారే లబోదిబొమంటున్నారు. ఇదిలా ఉండగా భూకబ్జాలపై రెవెన్యూ శాఖను అప్రమత్తం చేశారు. కబ్జా ఆరోపణలు వచ్చిన స్థలాలను గుర్తించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు, తాండూరు హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఎంఐఎం అధ్యక్షుడు హది నాలా స్థలం కబ్జా చేశారనే ఆరోపణలు రావడంతో రీ సర్వే చేయాలని యాలాల మండల రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో సర్వే మొదలుపెట్టారు. తమ నాయకులను బెదిరిస్తే ఊరుకోబోమని హైదరాబాద్ ఎంపి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసి తాండూరులో ఇటీవల హెచ్చరించిన విషయం విధితమే. తాండూరులో జరిగిన మరిన్న భూకబ్జాలు, , స్థలాల క్రమబద్దీకరణ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో జరిగిన అక్రమాలు విచారణ జరిపించాలని నిర్ణయించారు.

బఫర్‌జోన్‌లో అనుమతి లేని నిర్మాణాలు

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

● చెరువుల ఉనికికే ప్రమాదమంటున్న నిపుణులు



వెంకటాపూర్ నాడెంచెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 22 : చెరువులను, కుంటలు, కాలువలను కాపాడాలని ప్రభుత్వం చెబుతున్నా అది సాధ్యం కావడం లేదు. అక్రమార్కులు ఇష్టానుసారంగా బఫర్‌జోన్లను ఆక్రమిస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని వెంకటాపూర్ నాడెంచెరువు, ఎదులాబాద్‌లోని లక్ష్మినారాయణ చెరువుల బఫర్‌జోన్లను ఆక్రమించి పలువురు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ, ప్రహరీలను నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. బఫర్‌జోన్‌లు ఆక్రమణలకు గురికాకుండ అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆక్రమణల వల్ల చెరువుల విస్తీర్ణం తగ్గి ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బఫర్‌లో నిర్మాణాలను కూల్చివేస్తాం



వెంకటాపూర్ నాడెం చెరువు, ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువు బఫర్‌లో నిర్మాణాల విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని కూల్చివేస్తాం. చెరువుల స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడుతాం. సెలవు రోజులలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసింది. బఫర్‌లను ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదు.

అరిగే పరమేష్, ఇరిగేషన్ ఏఈ ఘట్‌కేసర్ మండలం

అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కులకచర్ల, జనవరి 22 : చౌడాపూర్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లను బహిరంగంగా మార్కెట్‌లో విక్రయించిన మందిపాల్ గ్రామానికి చెందిన పెంటయ్యపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం చౌడాపూర్‌లో రూ.5కే అంగన్‌వాడీ కోడిగడ్లను బహిరంగ మార్కెట్‌లో మందిపాల్ వెంకటయ్య విక్రయించగా గ్రామస్థులు పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అంజమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి పట్టుబడిన కోడిగుడ్లను స్వాధీనం చేసుకొని నింధితుడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆమె చెప్పారు. ఆ కోడిగుడ్లు వికారాబాద్ జిల్లాకు చెందినవి కావని తెలిపారు.

మ్యాథమేటిక్స్ టెస్ట్‌లో మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థి



జిల్లా స్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థి విద్యా సాగర్

ఆదిభట్ల, జనవరి 22 : జిల్లాస్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో బొంగ్లూరు ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి విద్యా సాగర్ ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచాడని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. సోమవారం విద్యాసాగర్‌ను ఉపాధ్యాయ బృందం తో కలిసి ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హయాత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించగా తమ పాఠశాలకు చెందిన విద్యాసాగర్ ప్రథమస్థానంలో నిలవడంతోపాటు, ఈనెల 29న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి టెస్ట్‌కు అర్హత సాధించాడని చెప్పారు.

ఆరేళ్లుగా అలసత్వం

● ప్రారంభం కాని బీటీ రోడ్డు పనులు

● అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యం

● దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్న ప్రజలు



బీటీ వేయాల్సిన రోడ్డు



రోడ్డు పనుల శిలాఫలకం

షాద్‌నగర్‌రూరల్, జనవరి 22 : నిధులు మంజూరై ఆరేళ్లయినా అధికారులు, కాంట్రాక్టరు అలసత్వం వల్ల ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ బూర్జుగడ్డతండా నుంచి కడియాలకుంట తండా వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదు. రోడ్డుపై పోసిన కంకర వల్ల దుమ్ము, దూలి లేవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు కోసం 2018లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. కోటి 35 లక్షలు మంజూరు కాగా అదే ఏడాది జూలై 18న నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాజీమంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కాంట్రాక్టరు పట్ల అధికారులు ఉదాసీనత చూపడంతోనే పనులు ప్రారంభం కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత జూన్ తర్వాత పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పి ఏడు నెలలు గడిచినప్పటికీ పనులలో ఎటువంటి పురోగతి లేదు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



శిలాఫలకం వేసి ఆరేళ్లు దాటినా రోడ్డు పనులు ప్రారంభించడం లేదు. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను ఎన్ని సార్లు కలిసి పనులు మొదలు పెట్టాలని కోరినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలి.

శ్రీను నాయక్, కడియాలకుంటతాండ


కొడంగల్: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


బొంరాస్‌పేట: హోమం నిర్వహిస్తున్న భక్తులు



శామీర్‌పేట: తూంకుంటలో విజ్ఞానభారతి పాఠశాల ఆవరణలో జైశ్రీరాం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


పరిగి: రామబాణం ఎక్కుపెడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మేడ్చల్ టౌన్: గౌడవెల్లి హోమం నిర్వహిస్తున్న భక్తులు

మార్మోగిన రామనామం

● అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● గ్రామాల్లో నెలకొన్న పండుగ వాతావరణం ● హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని సోమవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ మహా ఘట్టాన్ని వీక్షించేందుకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. పూజల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాల్లో ఆలయాలన్నీ రామనామ స్మరణతో మారుమోగాయి. రామ మందిరం ట్రస్ట్ పంపిణీ చేసిన అక్షింతలను శిరస్సుపై చల్లుకున్నారు. పలు ఆలయాల్లో అన్నదానం చేశారు. హిందూ సంఘాల సభ్యులు, ర్యాలీలు నిర్వహించారు.


యాలాల: జుంటుపల్లి రామస్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


వికారాబాద్: రామయ్యగూడ ఎంబిజీలో పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి


దోమ: శివారెడ్డిపల్లిలో శ్రీరాముల వారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మోమిన్‌పేట్: బేకులపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


తాండూరు రూరల్: గౌతాపూర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


కీసర: రామాలయంలో శ్రీ రామచంద్ర మూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


బంట్వారం: యాచారంలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు


ఘట్‌కేసర్: పూజల్లో పాల్గొన్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని యాదవ్


కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వీనగర్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు


తాండూరు: సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తదితరులు


పూడూరు: దేవనోనిగూడ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు


కులకచర్ల: పాంబండ రామాలయంలో తహసీల్దార్ మురళీధర్ పూజలు


దౌల్తాబాద్: పొల్కంపల్లిలో శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో శోభాయాత్ర


బషీరాబాద్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


నవాబుపేట: పులుమామిడి గ్రామంలో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ శ్రీరామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి


మూడుచింతలపల్లి: లక్ష్మాపూర్‌లోని శ్రీరాముల గుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


వికారాబాద్: ఇందిరానగర్ హనుమాన్ ఆలయంలో వద్ద అన్నదానం


ధారూరు: ధారూరు హనుమాన్ మందిర్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన నేతలు


తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌లు గురువారం కలిశారు. -వికారాబాద్

కరసేవకులకు సన్మానం


కరసేవకులను సన్మానిస్తున్న శివారెడ్డిపేట వాసులు

వికారాబాద్, జనవరి 22: అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టాలని నాడు కరసేవ కోసం వెళ్లిన వారిని అయోధ్య రామ మందిర విగ్రహా ప్రతిష్ఠాపనలో సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శివారెడ్డిపేట హనుమాన్ ఆలయంలో గ్రామపెద్దలు రాఘవేందర్, శ్రీనివాస్ శివారాజ్ ఆధ్వర్యంలో కరసేవకు వెళ్లిన కూర వాసు దేవ్, కోకట్ మాదవరెడ్డి, జగన్నాథ్‌లను ఘనంగా సన్మానించారు. పూలమాల శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

నేటి నుంచి సదరం క్యాంపునకు స్లాట్ బుకింగ్

వికారాబాద్, జనవరి 22: దివ్యాంగులకు సదరం క్యాంపునకు సంబంధించి మంగళవారం 12గంటల నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంద్యత, చెవుడు, మూగ గల దరఖాస్తుదారులు హాజరుకావాలన్నారు. అదేవిధంగా 27, 30 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నిర్వహించే క్యాంపులకు అంగవైకల్యం ఉన్న వారు, అంధులు హాజరుకావాలన్నారు. ఇట్టి క్యాంపులకు గతంలో సదరం సర్టిఫికెట్ పొంది పరిమితి ముగిసిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరుకావాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మేడ్చల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నేడు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. కలెక్టర్ గౌతమ్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని, జిల్లాలోని జడ్పీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సీఈవో కోరారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కీసర రూరల్, జనవరి 22: పార్కులోని అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని నాగారం మున్సిపాలిటీ శివసాయి ఎన్‌క్లేవ్-1 కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేందర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివసాయి ఎన్‌క్లేవ్-1 కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఓ గదిని ఏర్పాటు చేసుకున్నారని, దాంట్లో వారు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి, వీరన్నగౌడ్, శ్రీనివాస రావు, నీరజలక్ష్మి, లత, స్వాతి పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి

శామీర్‌పేట, జనవరి 22: కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ శ్రీసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. శామీర్‌పేటలోని సబ్‌పోస్టాఫీసును సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న తపాలా సేవలను, అధికారులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఈ పోస్టాఫీసులో ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఆధార్‌సేవలను కూడా ఆయన పరిశీలించారు. ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. పోస్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో అనుకూలంగా ఎన్నో సంక్షేమ పథకాల సేవలను అందిస్తోందన్నారు. ఆ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్, పోస్టు మాస్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **పరిగి:** పల్లెసీమలే అభివృద్ధికి పట్టుకొమ్మలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తొండపల్లిలో కొత్తగా నిర్మించిన పంచాయితీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, హన్మంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** డబ్బును పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ గ్రామీణబ్యాంక్ అవుషాపూర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్‌కుమార్ తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌లో సోమవారం ఫైనాన్షియల్ లిట్రసీ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పూడూరు: రాహుల్ గాంధీ నేతృత్వంలో శాంతియుతంగా చేపట్టిన భారత్‌జోడో యాత్రపై బీజేపీ నాయకులు చేసిన దాడులను ఖండిస్తున్నట్లు తెలంగాణ యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలో సోమవారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి అస్సాం సీఎం హిమంతబిస్వాశర్మ దిష్టి బొమ్మను దహనం చేశారు.

● **కులకచర్ల:** రాంపూర్ గ్రామానికి చెందిన బచ్చయ్యకు గ్రామ ప్రజలు చేయూతనందించారు. బచ్చయ్య 15రోజుల కిందట హైదరాబాద్‌లో భవన నిర్మాణ పనులు చేస్తుండగా భవనంపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబానికి సోమవారం రూ.65వేలు 500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **మేడ్చల్ టౌన్:** బండమాదారం గ్రామంలో మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి, ముక్కు, చెవి, గొంతు, థైరాయిడ్, బీజకుట్టు గడ్డలు, కనతులు, గర్భ సంచి సమస్యల పట్ల ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, శ్రావ్య, నిశాంత, కుమారస్వామి, నాగార్జున, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** ఎన్కేపల్లి గ్రామ సమీపంలో స్వామివివేకానంద విగ్రహ ఏర్పాటుకు సోమవారం గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్రచారి, పట్లోళ్ల రాజశేఖర్‌రెడ్డి, పూజారి నర్సింహులు, రాములు, పెద్ద కురువ శేఖర్, చంద్రశేఖర్, లక్ష్మప్ప, రమేశ్, వడ్డె వెంకటయ్య సంగెం అంజి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యర్థుల ఆత్మీయ పలకరింపులు


తాండూరులోని గోశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

తాండూరు, జనవరి 22: శాసనసభ ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎన్నికల తర్వాత తొలిసారి తారసపడ్డారు. గోశాలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న వారు ఇరువురూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. సీతారాముల విగ్రహాలకు హారతిచ్చారు. గతంలో ఇద్దరూ బీఆర్ఎస్‌లో మిత్రులైనప్పటికీ వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే.

నేడు విద్యుత్ అంతరాయం

కీసర రూరల్, జనవరి 22: నాగారం సబ్‌స్టేషన్, బండ్లగూడ, బాపురెడ్డినగర్ 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆయాప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నాగారం ఏఈ కామేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా 33కేవీ విద్యుత్ ఉపకేంద్రం బాలంపేట్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహిపాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయాన్ని నిర్మించడం సంతోషకరం

బంట్వారం(కోట్‌పల్లి), జనవరి 22: మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. చందనగిరినగర్ వెంచర్‌లో సోమవారం కోట్‌పల్లి గ్రామానికి చెందిన కందూరి శివకుమార్, ప్రదీప్, దీపగారి వెంకట్‌రెడ్డి, మాల్‌రెడ్డి, రావులపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిలు అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి స్థలాన్ని ఇవ్వడంతో నిర్మాణ పనులు చేపట్టడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమలో విశ్వం పంతులు, బందెయ్య, రాజేశ్వర్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ నెపంతో గొంతు కోసి పరార్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింహులు

ధారూరు, జనవరి 22: సెల్‌ఫోన్ చోరీ చేశాడనే నెపంతో ఓ వ్యక్తిపై సీసతో గొంతు కోసిన ఘటన సోమవారం రాత్రి ధారూరు పీఎస్ పరిధిలోని రుద్రారం, నాగసమందర్ గ్రామాల మధ్య జరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండలంలోని కుక్కింద గ్రామానికి చెందిన బోయ పకీరప్ప, కుర్వ శ్రీను, జహీరాబాద్ సమీపంలోని బుధేరా మండలం, పిల్లోడి గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు, సదాశివపేట సమీపంలోని కమ్మకోల్ గ్రామానికి చెందిన అంబయ్యలు కలిసి ఆదివారం రాత్రి వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తుండగా బోయ పకీరప్ప సెల్‌ఫోన్‌ను గొల్ల నర్సింలు తీసుకున్నాడు. ఉదయం పకీరప్ప తన సెల్‌పోన్ అడుగగా సెల్‌ఫోన్ లేదని నర్సింహులు చెప్పటంతో గొడవ పడ్డారు. కాగా, మున్నూరుసోమారం చెరువు వద్దకు వచ్చి స్నానం చేసి నలుగురు కలిసి రుద్రారం వైపువెళ్లారు. మద్యం మత్తులో వీరు రుద్రారం అటవీప్రాంతంలో సెల్‌పోన్ ఎక్కడ దాచావని నర్సింహులును కుర్వ శ్రీను ప్రశ్నించగా తనకు తెలియదని నర్సింలు తెలిపాడు. దీంతో నర్సింలు స్నేహితుడు అంబయ్యను చెట్టుకు కట్టేశారు. అనంతరం నర్సింహులును బోయ పకీరప్ప గట్టిగాపట్టుకోగా కుర్వ శ్రీను పక్కనే ఉన్న సీసాను పగులగొట్టి నర్సింహులు గొంతు కోసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన నర్సింహులును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని నర్సింహులును ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కొడంగల్ రూరల్, జనవరి 22: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బోయపల్లి తండా నుంచి రావుల్‌పల్లి వైపు సోమవారం ఇసుక లోడ్‌తో వెళ్తున్న టీఎస్ 34 టీఏ 7961 నెంబర్ గల ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ట్రాక్టర్ డ్రైవర్ రాథోడ్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై కేసు నమోదు

వికారాబాద్, జనవరి 22: వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఆలంపల్లి సర్వేనెంబర్ 290, 291, 292లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పినా వినకుండా నిర్మాణాలు చేపడుతున్న కోడి జంగయ్య, దుద్యాల రామచంద్రయ్యలపై కేసు నమోదు చేసి చట్ట పరంగా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇంకెవరైనా అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ భూమిలో చేపడితే వారిపైన కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.